నేడు విద్యుత్ అంతరాయం

మెదక్ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న పనుల కోసం శనివారం పట్టణంతోపాటు మెదక్, హవేలీఘణపూర్, చిన్నశంకరంపేట మండలాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈలు నవీన్‌కుమార్, రాజ్‌కుమార్, దినాకర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇకపై ప్రతీ శుక్రవారం బడిబాట



సంగారెడ్డి కల్యకుంటలో 'బడిబాట' నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడం కోసం విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నది. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే వరకు ప్రతీ శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వ పాఠశాలల టీచర్లు ఆవాసాల బాటపట్టారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు కలిసి ఇంటింటికి తిరుగుతూ తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని సూచిస్తున్నారు. సర్కారు బడిలో ఉన్న సౌకర్యాల్లో భాగంగా ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, అనుభవాజ్ఞులైన టీచర్లతో బోధన అందుతుందని వివరిస్తున్నారు.

నర్సాపూర్ అర్బన్‌పార్కులో కాటేజీలు త్వరలో ప్రారంభం



కాటేజీలను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్

నర్సాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ అర్బన్‌పార్కులో నూతనంగా నిర్మించిన కాటేజీల పనులను మరో 20 రోజుల్లో పూర్తిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఆయన శుక్రవారం సాయంత్రం నర్సాపూర్ అర్బన్‌పార్కులో నిర్మాణంలో ఉన్న కాటేజీలను డీఎఫ్‌వో జోజి, ప్రాజెక్టు మేనేజర్ జగన్మోహన్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్బన్‌పార్కులో యాత్రికుల కోసం 38 కాటేజీలు, స్విమ్మింగుపూల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు జిమ్, ఓపెన్ డెక్, గార్డెన్ తదితర సదుపాయాలు కూడా ఉంటాయన్నారు. రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా కాటేజీలను ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులోకి తేనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పనులను త్వరలోనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిన్నారం మండలంలో త్వరలో నూతన పారిశ్రామికవాడ ఏర్పాటు కానున్నది. వావిలాల గ్రామ పరిధిలోని 190 సర్వే నంబర్‌లో 34 ఎకరాలను టీజీ ఐఐసీ ద్వారా ఎమ్మెస్ఎంఈ యూనిట్ల కోసం కేటాయించారు. మండలంలోనే అల్లీనగర్ పరిధిలోని 27 సర్వే నంబర్‌లోనూ పరిశ్రమలకు భూములు కేటాయించేందుకు అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. దీంతో, మండలంలో కొత్తగా 200 పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు.



వావిలాలలో పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ తాత్కాలిక కార్యాలయం

బాలానగర్ టు వావిలాల

పరిశ్రమలకు 34 ఎకరాలు కేటాయింపు

- తరలిరానున్న సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు
- 110 యూనిట్లకు భూముల కేటాయింపు
- 5వేల నుంచి, 200 చదరపు మీటర్ల ప్లాట్లు
- రోడ్డు సమస్యకు పరిష్కారం
- 80 అడుగుల మేర విస్తరణ
- అవసరమైన భూమి సేకరణ
- అల్లీనగర్‌లో భూములు కూడా పరిశ్రమలకే..

జిన్నారం, మే, 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలోని బాలానగర్, సనత్‌నగర్ ప్రాంతంలో ఉన్న చిన్న, సూక్ష్మ ఇంజనీరింగ్ పరిశ్రమలు (ఎమ్మెస్ఎంఈ యూనిట్లు) సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలానికి తరలిరానున్నాయి. వావిలాల పరిధిలోని 190 సర్వే నంబర్‌లో 34 ఎకరాలను టీజీఐఐసీ ద్వారా సేకరించిన ప్రభుత్వం 110 పరిశ్రమలకు కేటాయించింది. ఇక్కడ చిన్న, సూక్ష్మ, జాబ్ వర్క్, ఇంజనీరింగ్ తదితర పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం స్థలాన్ని చదును చేసి బాలానగర్ మైక్రో, స్మాల్ పరిశ్రమల సమాఖ్య పేరిట తాత్కాలిక కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ఎంపిక చేసిన స్థలానికి వెళ్లేందుకు ఇప్పటి వరకు రోడ్డు సమస్య ఉండగా.. ఇటీవల కొర్లకుంట సమీపం నుంచి 80 అడుగుల విస్తీర్ణంతో రహదారిని విస్తరించేందుకు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులు సర్వే నిర్వహించారు. త్వరలోనే రోడ్డు ఏర్పాటు పనులు చేపట్టి పారిశ్రామికవాడలో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. అల్లీనగర్ సర్వే నంబర్ 27లోని భూములను కూడా పరిశ్రమలకు కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే పరిశ్రమలు ఉండగా గత ఏడాది కొన్ని పరిశ్రమలకు భూములు కేటాయించారు. మిగిలిన స్థలాలను పరిశ్రమలకు కేటాయించేందుకు రంగం సిద్ధమైంది. గత నెలలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, టీజీఐఐసీ అధికారులు ఆయా భూములను పరిశీలన చేసి స్థానికులతో మాట్లాడారు. త్వరలో ఈ స్థలాలను పారిశ్రామికవాడ కోసం కేటాయించనున్నట్లు వారు తెలిపారు. గుమ్మడిదలలో సర్వే నంబర్ 109లోని భూములను కూడా పరిశ్రమల కోసం కేటాయించేందుకు ఇటీవలే గ్రామసభను నిర్వహించారు.

కొత్త పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

జిన్నారం మండలంలోని పరిశ్రమల్లో ప్రస్తుతం 80వేల మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో 70 శాతం మంది ఇతర రాష్ట్రాలవారు కాగా, 10 శాతం తెలుగు రాష్ట్రాల ప్రజలు. కొత్త పారిశ్రామికవాడల ఏర్పాటు, ఉన్నవాటి విస్తరణతో మరో 5వేల మందికి ప్రత్యక్షంగా, 8 వేల మందికి పరోక్షంగా ఉపాధి దొరకనుంది. కొత్త పరిశ్రమలన్నీ కాలుష్య రహిత, పర్యావరణ హితమైనవే కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అల్లీనగర్‌లోని సర్వే నంబర్ 27లో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో, టీజీఐఐసీ అధికారులు (ఫైల్)

మొత్తం సీలింగ్ భూములు సర్వే చేయాలి



వావిలాల పరిధిలో ఎమ్మెస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు భూములు కేటాయించడం అభినందనీయం. ఇక్కడ మరిన్ని పరిశ్రమల ఏర్పాటు కోసం స్థలాలు కేటాయించాలి. గ్రామంలోని సర్వే నంబర్ 190లో మొత్తం 60 ఎకరాల సీలింగ్ భూమి ఉంది. కానీ, అధికారులు సర్వేచేసి 34 ఎకరాలే గుర్తించారు. మిగిలిన 26 ఎకరాలను గుర్తించి పరిశ్రమల ఏర్పాటు కోసం కేటాయించాలి. దీనిపై రెవెన్యూ అధికారులకు విన్నవించాం.

-రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ, జిన్నారం

మెదక్ జిల్లాను నంబర్‌వన్‌గా నిలపాలి

- 'ఉల్లాస్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

7లో



పకడ్బందీగా ఆన్‌లైన్ నమోదు

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



7లో

పోలీసులకు చలాన్ల టార్గెట్లు

- దాడులకు దారితీస్తున్న తనిఖీలు
- వాహనదారులకు భారంగా జరిమానాలు


7లో

గోతులు తీశారు.. పనులు మరిచారు

- ముస్లాపూర్‌లో పీహెచ్‌సీ భవనానికి ఆర్నెళ్ల క్రితం రూ.20 లక్షలు మంజూరు
- రెండున్నర నెలలుగా పునాదుల దశలోనే..

8లో

పాతుకుపోయారు!



నారాయణఖేడ్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ రైటర్‌గా ఏళ్ల తరబడి పనిచేశారు. ఆయనకు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించినా అక్కడే రైటర్‌గా కొనసాగారు. మరో పదేళ్లు పనిచేసిన అనంతరం ఏఎస్ఐగా పదోన్నతి వరించింది. అయినా, అక్కడే పనిచేస్తానని పైరవీ చేసి మరీ పోస్టింగ్ వేయించుకున్నారు. మారుమూల స్టేషన్ నుంచి పట్టణానికి పదోన్నతిపై బదిలీ అయితే సంబరపడకపోగా.. అక్కడే పనిచేయడానికి మొగ్గుచూపడానికి కారణమేంటని చర్చించుకుంటున్నారు.

- పోలీస్‌స్టేషన్లలో రైటర్లదే రాజ్యం
- బదిలీలు లేకుండా ఏళ్లుగా ఒకేచోట తిష్ఠ
- ఎస్ఐలు, సీఐలు ఎవరొచ్చినా మారని రైటర్లు
- బదిలీ అయినా డిప్యూటేషన్‌పై మళ్లీ అక్కడే విధులు
- రాజకీయ నేతలతో చెట్టాపట్టాలు
- పైరవీలు నడిపేది వీరే
- మారుమూల ప్రాంతాలపై మక్కువెందుకు?

సంగారెడ్డి క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో అనేక పోలీస్‌స్టేషన్లలో రైటర్లు ఏళ్లకేళ్లుగా పాతుకుపోయారు. ఇతర ప్రాంతాలకు బదిలీ అయినప్పటికీ డిప్యూటేషన్‌పై వచ్చి మరీ పాత స్థానాల్లోనే పనిచేయడానికిఇష్టపడుతున్నారు. దీనికి ప్రధానకారణం ఆయా ప్రాంతంపై పట్టు ఉండటం, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి ద్వారా పైరవీలు చేసుకుంటున్నారని విమర్శలున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా వచ్చే ఎస్ఐ, సీఐలకు ఆయా ప్రాంతంలో ఉన్న వనరులు, రాజకీయ నేతల చరిత్ర గురించి చెబుతూ అక్రమంగా సంపాదిస్తున్నారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

బదిలీలకు అతీతం

జిల్లాలో మొత్తం 34 పోలీస్‌స్టేషన్‌లున్నాయి. ఇందులో సంగారెడ్డిలో, జహీరాబాద్‌లో రూరల్ పోలీస్‌స్టేషన్లు, సంగారెడ్డిలో మహిళా పోలీస్‌స్టేషన్, రెండు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. పోలీసుశాఖలో సర్వసాధారణంగా ప్రతీ రెండు, మూడేళ్లకు కానిస్టేబుల్ మొదలుకొని ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్థాయివరకు బదిలీ జరగాలి. అత్యధికంగా ఐదేళ్లకు మించి ఎవ్వరూ ఒకే ప్రాంతంలో పనిచేయకూడదు. కానీ, సంగారెడ్డి జిల్లాల్లో రైటర్లుగా పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్లు 10-20 ఏళ్లుగా ఒకేచోట తిష్టవేశారు.

రాజకీయ నేతలతో సంబంధాలు

కానిస్టేబుల్‌గా ఉన్న రైటర్ హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐగా పదోన్నతి పొందినా రైటర్‌గా అదే సర్కిల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏళ్లుగా రైటర్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తుండడంతో రాజకీయ నాయకులు, వ్యాపారులు, ఇతర వర్గాలతో పరిచయాలు ఏర్పడుతున్నాయి. ఎస్ఐ, సీఐ, డీఎస్పీ ఎవరొచ్చినా వారిని ఇట్టే బుట్టలో వేసుకుంటున్నారు. దీంతో, పోలీసు అధికారులు వీరి కనుసన్నల్లోనే నడుస్తున్నారు.

నిజాయితీపరులకూ మరకలు

కొత్తగా విధుల్లో చేరిన కొందరు అధికారులు నిజాయితీగా ఉంటూ ఏదో సాధించాలన్న తపనతో పోలీసుశాఖలో అడుగుపెడతున్నారు. కానీ, కొందరు రైటర్లు వారిని పక్కదారి

మిగతా 8వ పేజీలో

విజయోస్తు..





ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యానికి సంపూర్ణ విజయం సిద్ధించాలని శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయం, సంగారెడ్డి జిల్లా బోరంచ నల్ల పోచమ్మ ఆలయం, బడంపేట రాచన్నస్వామి ఆలయంతో పాటు పలుచోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, యుద్ధంలో మృతిచెందిన తెలుగు సైనికుడు మురళీనాయక్‌కు నివాళిగా జహీరాబాద్‌లో సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

-పాపన్నపేట/మనూరు/కోహీర్/జహీరాబాద్



జహీరాబాద్‌లో క్యాండిల్ ర్యాలీ

తరగతి గదిలో నో సెల్‌ఫోన్

- విద్యాశాఖ ఆదేశాలు
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- ఆదేశాలు పాటించకపోతే కఠిన చర్యలు
- సంగారెడ్డి జిల్లాలో 5,388 మంది టీచర్లు



సంగారెడ్డి అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులకు సెల్‌ఫోన్ వాడకంపై విద్యాశాఖ ఆకాంక్షలు విధించాలని నిర్ణయించింది. ఇటీవల డీఈవోలతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా నిర్వహించిన సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగించకుండా చూడాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలని డీఈవోలకు సూచించింది. అయితే వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ ఆదేశాలు అమలు చేయాలని స్పష్టం చేసింది. కాగా సంగారెడ్డి జిల్లాలో 1,247 ప్రభుత్వ పాఠశాలలుండగా, అందులో 5,388 మంది టీచర్లు పనిచేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల టీచర్లు బోధన పక్కన పెట్టి సెల్‌ఫోన్ మాట్లాడటం, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూడడం, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తరగతిలో సెల్‌ఫోన్‌తో హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బోధన చేయకుండా బాధ్యతలు విస్మరించి విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇంకొంతమంది పాఠశాలకు వచ్చిన నుంచి తిరిగి సాయంత్రం తిరుగుపయనమయ్యే వరకు ఫోన్‌లోనే మునిగితేలుతున్నారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. టీచర్ల వ్యవహారం తల్లిదండ్రుల్లో విస్మయం వ్యక్తమవుతున్నది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లో తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడకుండా కట్టడి చేయాలని సర్కారు భావించి ఈమేరకు చర్యలకు ఉపక్రమించింది. విద్యాశాఖ అధికారులు తనిఖీకి వెళ్లిన సందర్భంలో తరగతి గదిలో సెల్‌ఫోన్ వాడుతున్నట్టు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. అయితే తరగతి గదిలోకి సెల్‌ఫోన్ కట్టడి విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయవర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సర్వేయర్ శిక్షణ కోసం దరఖాస్తులు

నారాయణఖేడ్, మే 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ కోసం అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అర్హులైన అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా రూ.100 రుసుము చెల్లించి లైసెన్సు సర్వే శిక్షణ కోసం ఈ నెల 17 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో గణితం సబ్జెక్టు కలిగి ఉండి, కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఐటీఐ నుంచి డ్రాఫ్ట్‌మెన్(సివిల్), డిప్లొమా సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కోసం ఓసీ అభ్యర్థులు రూ.10వేలు, బీసీ అభ్యర్థులు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2,500 చొప్పున చెల్లించాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా కేంద్రంలో 50 పని దినాల్లో తెలంగాణ అకాడమీ లాండ్ ఇన్ఫర్‌మేషన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 6302476752, 8498855991, 9885453556 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన

తూకంలో మోసానికి పాల్పడుతున్నారని ఆరోపణ

చేగుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్కరాజ్‌పేటలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకంలో అవకతవకలక పాల్పడుతున్నారని రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. క్వింటాలుకు మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని గుర్తించారు. నిర్వాహకులపై చర్యలు తీసుకొని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. తహసీల్దార్ వచ్చిన రెండు గంటల తరువాత ఐకేపీ అధికారులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనతోపాటు ఆర్ఐ సంతోష్, ఏపీఎం లక్ష్మీనరసమ్మ ఉన్నారు.

జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం

మెదక్ అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన ముగ్గురు జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. తెలంగాణ మీడియా అకాడమీ జర్నలిస్టు సంక్షేమ నిధి ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం మంజూరైంది. హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. అంతేకాకుండా బాధిత కుటుంబాల బ్యాంకు ఖాతాలో ఈ నెల నుంచి రూ. 3వేల చొప్పున పింఛన్ అందజేయనున్నట్లు టీయూడబ్ల్యూజే మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌దయాల్ తెలిపారు.

పోలీసు వ్యవస్థను కించపరిచడం సరికాదు

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత , దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి


చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో పోలీసు వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడి ఎంతో మంది వ్యక్తుల వ్యక్తిగత సమాచారం సేకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు నేడు పోలీసు వ్యవస్థను కించపరిచేలా మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డికి బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో మద్యం ఏరులై పారింది కనిపించలేదా అని ప్రశ్నించారు. ఎంపీగా ఉన్న సమయంలో యువత ఉపాధి కోసం పరిశ్రమలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలని కోరాల్సింది పోయి పబ్బు కావాలని కోరిన వ్యక్తి నేడు ప్రభుత్వ విధానాల పట్ల ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేసి గెలిచిన ఎమ్మెల్యే నేడు అవినీతి గురించి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎక్కడో ఒకచోట పోలీసులు లంచం తీసుకుని పట్టుబడితే మొత్తం పోలీసు వ్యవస్థనే అవినీతి మయం అయిందని దుబ్బాక ఎమ్మెల్యే మాట్లాడటం దారుణమన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడటం ఇకనైనా ఎమ్మెల్యే మానుకొని అభివృద్ధికి కలిసి రావాలని ఆయన హితవు పలికారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధుడి మృతి


పోచయ్య (ఫైల్)

వర్గల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన వర్గల్ మండలం గిర్మాపూర్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మెదక్ జిల్లా శివంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన దేవోల్లా పోచయ్య శుక్రవారం ఉదయం తన టీవీఎస్ ఎక్సల్ వాహనంపై వర్గల్ మండలంలో శుభకార్యానికి వస్తున్నాడు. ఈ క్రమంలో వర్గల్ మండలం మాదారం గిర్మాపూర్ గ్రామాల మధ్యలో ఉన్న రహదారి మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడింది. దీంతో పోచయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూమారుడు దేవోల్లా రవి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మాసాయిపేట, మే 9(ఆంధ్రజ్యోతి) : మాసాయిపేట మండలం కొప్పులపల్లి వద్ద హల్దీ ప్రాజెక్టులో గురువారం రాత్రి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. వెల్దుర్తి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన చర్లపల్లి గ్రామం వర్ధమాన్ తాండాకు చెందిన కేతావత్ గోపాల్ నాయక్(32) కాలుజారి హల్దీ ప్రాజెక్టులో పడి గల్లంతయ్యాడు శుక్రవారం మధ్యాహ్నం మృతదేహం నీటిలో తేలడంతో వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 19 మందిపై కేసు

కంగ్టి, మే 9(ఆంధ్రజ్యోతి): దంతాలను శుభ్రం చేసుకుంటూ రోడ్డుపై ఉమ్మి వేసిన విషయమై ఇరువర్గాల వారు ఘర్షణ పడడంతో మొత్తం 19 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7న ఉదయం మండల పరిధిలోని నాగూర్.కె గ్రామానికి చెందిన బిరాదర్ సంతోష్ దంతాలను శుభ్రం చేసుకుంటూ రోడ్డుపై ఉమ్మి వేశాడు. ఇది చూసిన అదే గ్రామానికి చెందిన మహాదేవ్ ఇక్కడ ఎందుకు ఉమ్మివేశావని ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది.. పెద్దలు జోక్యం చేసుకొని ఇరువురిని సముదాయించి పంపారు. కాని మహాదేవ్ తన అనుచరులైన ప్రభు, ధన్‌రాజ్, మలిశెట్టి, రవి, ప్రశాఅంత్, వీర్‌శెట్టి, గంగ్‌శెట్టి, శివనాథ్, శంకుపాటిల్, అశోక్‌లను పిలిపించి జగన్నాథ్ సంతోష్‌ల కుటుంబ సభ్యులపై కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడు జగన్నాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేశారు. ఇదే ఘటనలో తమ నీటి నల్లా వద్ద ఎందుకు ఉమ్మి వేశావని అడిగినందుకు తమపై సంతోష్‌తో పాటు లక్ష్మి, తులసీరాం, అశోక్, శకుంతల, నిఖిల్‌లు దాడి చేశారని ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో వర్గానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

23.3 కిలోల గంజాయి పట్టివేత

● నిందితుల అరెస్ట్, కారు స్వాధీనం


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

సంగారెడ్డి క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం పలుచోట్ల మెరుపు దాడులు నిర్వహించి మొత్తం 23.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయిని తీసుకొని వచ్చి మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో విక్రయించే వ్యక్తిని సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన జలీలొద్దిన్ సిద్ధిఖి అహ్మద్‌హాస్సేన్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతడు జీతం డబ్బులు సరిపోక గంజాయి క్రయ, విక్రయాలకు పాల్పడేవాడు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఇదే క్రమంలో శుక్రవారం 20 కిలోల గంజాయి సీలేరు నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తుండగా సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని, నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో పాటు కారు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నిందితుడికి గంజాయి విక్రయించిన లక్ష్మీబాయి, కృష్ణపై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జైలుకెళ్లినా తీరు మారలే...

జలీలొద్దిన్ సిద్ధిఖీ అహ్మద్ హాస్సేన్ 2023లో గంజాయి రవాణా చేస్తూ అబ్దుల్లాపూర్‌మెట్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా గంజాయి రవాణా, విక్రయాల అలవాటు మాత్రం మానుకోలేదు. తాజాగా శుక్రవారం సంగారెడ్డిలో ఎక్సైజ్ పోలీసులకు చిక్కి మరోసారి జైలు పాలయ్యాడు.

మూడు ఘటనల్లో..


పోలీసుల అదుపులో నిందితులు

అదేవిధంగా ఎస్ఆర్‌నగర్‌కు చెందిన సందీప్ నుంచి కిలోన్నర గంజాయి, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ అధికారులు వీణా రెడ్డి, గాంధీ తెలిపారు. తెలిపారు. మరోకేసులో 615 గ్రాముల గంజాయి, బైక్, బీరంగూడకు చెందిన సాయికుమార్, శ్రీకాంత్‌ల నుంచి 12 కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

కిందపడి రికార్డ్ అసిస్టెంట్ మృతి

బెజ్జంకి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన వ్యక్తి కిందపడి మృతి చెందిన సంఘటన బెజ్జంకి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకికి చెందిన న్యాత మల్లేశం(50) కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మల్లేశం సుమారు ఆరు నెలల క్రితం నుంచి మద్యానికి బానిసయ్యాడు. నాలుగు రోజుల నుంచి మద్యం సేవించి ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆఫీసుకు వెళ్లిన మల్లేశం రాత్రి 8 గంటల వరకు ఇంటికి తిరిగి రాలేదు. మల్లేశం కోసం తన భార్య శ్యామల ఎదురు చూస్తుండగా ఇంటి సందులోకి వస్తు కిందపడి గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతనిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మృతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

మల్లన్న రైల్వేస్టేషన్‌కు ఆరున్నర ఎకరాలు

● భూ సేకరణకు అధికారుల సన్నాహాలు

● కొందరు రైతుల అంగీకారం.. మరికొందరు ససేమిరా

చేర్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారులోని మల్లన్న రైల్వే హాల్ట్‌స్టేషన్ భవిష్యత్ అవసరాల కోసం సుమారు ఆరున్నర ఎకరాల స్థలాన్ని సేకరించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పలువురు రైతులు భూములు అప్పగించడానికి అంగీకరించగా, మరికొందరు ససేమిరా అంటుండటం చర్చనీయాంశంగా మారింది. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ కొమురవెల్లి గ్రామశివారులో నుంచి నిర్మాణం జరిపారు. ప్రముఖ శైవక్షేత్రం మల్లన్న ఆలయం స్థానికంగా ఉండటం, యేటా లక్షలాది మంది తరలివస్తున్న నేపథ్యంలో రవాణా సౌకర్యం మెరుగుదల కోసం స్వామివారి పేరిట రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తూవచ్చారు. ఎన్నో ఒత్తిడులు, మరెన్నో వినతుల నడుమ అవాంతరాలు తొలగి సుమారు ఏడాదిన్నరక్రితం రైల్వే బోర్డ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో హాల్ట్‌స్టేషన్‌కు అందుబాటులో ఉన్న ప్రభుత్వభూమిని కేటాయించారు. దీంతో ఒకేమార్గం గుండా ప్లాట్ ఫాం నిర్మాణం చేపట్టారు. ఇతరత్రా వెయిటింగ్‌హాల్, బుకింగ్ కౌంటర్ ఇతరత్రా పనులు తుదిదశకు చేరుకున్నాయి. కానీ హాల్ట్ కాకుండా అన్ని వసతులతో కూడిన రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దాలని కొంతకాలంగా డిమాండ్ కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో ప్లాట్ ఫాం విస్తరణ, ఇతరత్రా అవసరాలకు అవసరపడేలా సమీపంలోని భూములను సేకరించేందుకు నిర్ణయించారు. అందుకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 376లో 6.13 ఎకరాల భూమిని 23 మంది రైతుల నుంచి సేకరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎకరాకు రూ.14 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలుపుతూ ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సంబంధిత పరిహారానికి కొందరు రైతులు అంగీకరించగా, మరికొందరు పరిహారంపెంచి ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. త్వరలో ఇతరత్రా ప్రక్రియ పూర్తిచేపట్టి రైల్వేశాఖకు భూమిని స్వాధీనపరచనున్నారు. దీంతో రైల్వే వినియోగదారులకు మెరుగైన వసతుల కల్పనకు అవకాశం కలగనుండగా, పూర్తిస్థాయి స్టేషన్‌గా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.



కొమురవెల్లి శివారులోని రైల్వేస్టేషన్

ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తాం..



రైల్వేస్టేషన్‌కోసం కొమురవెల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నం.376లో 6.13ఎకరాల భూమి సేకరణ కోసం ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించాం. పలువురు రైతులు అంగీకరించారు. మిగతావారు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఆయా అంశాల నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనానుసారం త్వరితగతిన సేకరణ ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం.

-జి. దివ్య, కొమురవెల్లి తహసీల్దారు



భూ రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి

పకడ్బందీగా ఆన్‌లైన్ నమోదు

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి

కొండాపూర్, మే9(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి స్వీకరించిన భూ సమస్యల వివరాల ఆన్‌లైన్ నమోదు పకడ్బందీగా చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. తప్పిదాలకు తావులేకుండా డాటా ఎంట్రీ చేయాలని సంబంధిత ఆపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లిలో భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సును, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. భూసమస్యలను తెలుసుకొని, దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం భూ భారతి చట్టం అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం భూ సమస్యల పరిష్కారం ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదస్సులో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి, తహసీల్దార్లు అశోక్, రవీందర్, డీటీ ప్రదీప్, ఆర్‌ఐలు రాజు, రాంచందర్ పాల్గొన్నారు.

● సంగారెడ్డి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కంకోల్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు మధుకుమార్‌ను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రశంసించారు. కాళ్లు, చేతులు కోల్పోయినా ఆత్మవిశ్వాసంతో చదివి ఇటీవల వెలువడిన పదోతరగతి ఫలితాల్లో 86 శాతం మార్కులు సాధించి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడని కొనియాడారు. ఈ మేరకు మధుకుమార్, అతని తల్లిదండ్రులను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె ఘనంగా సన్మానించారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళిక

● కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి



సమావేశంలో యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి, తదితరులు

ములుగు, మే 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యాన పంటల అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కొండా లక్ష్మణ్ ఉద్యానవన యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు శివారులోని యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఉపకులాపతి డాక్టర్ దండా రాజిరెడ్డి అధ్యక్షతన విద్యాలయ అధికారుల సమక్షంలో ఉద్యానవన రంగ కీలక భాగస్వాములైన రైతులు, ఉత్పత్తిదారుల సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు, ప్రగతిశీల రైతులు, ఎఫ్‌పీఓ నాయకులు, వ్యాపార సంస్థలు, ఎగుమతి దారులు, ఇన్‌పుట్ సరఫార దారులు పరిశోధన నిపుణులతో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఉద్యానవన పంటల సాగు యొక్క స్థిరమైన అభివృద్ధి కోసం, ఉద్యానవన రంగంలో వేగవంతమైన వృద్ధిని సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ దృక్పథ ప్రణాళికపై ముఖాముఖీ చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుత సవాళ్లను పరిష్కరించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. స్థితిస్థాపక పంట ప్రణాళికను సులభతరం చేయడంలో యూనివర్సిటీ నిబద్ధతను కొనియాడారు. వ్యవసాయం కోసం మార్కెట్‌లతో అనుసంధానించడంలో డిజిటల్ ప్లాట్‌ఫాం పాత్ర తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యాన సమగ్ర అభివృద్ధి కోసం తమ నాలెడ్జ్ హబ్, ఇన్నోవేషన్ మార్గదర్శకుడిగా తన పాత్ర పోషిస్తుందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్టర్ డాక్టర్ భగవాన్, ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, అప్పారావు, వివిధ అంశాల బాధ్యులు, డాక్టర్‌లు చీనానాయక్, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, రాజశేఖర్, వీణజోషి, సతీష్ పాల్గొన్నారు.

మెదక్‌ను నంబర్ వన్‌గా నిలపాలి

● ఉల్లాస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్, మే 9(ఆంధ్రజ్యోతి): విద్యాపరంగా జిల్లాను రాష్ట్రస్థాయిలో నంబర్ వన్‌గా నిలపాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎంఈవో, హెచ్‌ఎంలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవో, హెచ్‌ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ విద్యా ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపర్చిందన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తూ... 15 ఏళ్లు నిండిన నిరక్షరాస్యత గుర్తించి వారికి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిదేనన్నారు. సమావేశంలో డీఈవో రాధాకిషన్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, డీఎస్‌వో రాజిరెడ్డి, ఏఎస్‌వో నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ పురోగతిపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ తక్కువ బరువు పిల్లలను గుర్తించి వారు జులైలోపు పోషకాహార లోపాన్ని అధిగమించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు అన్ని రకాల పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో శిశు మరణాలు లేకుండా చూసుకోవాలని, అక్రమ దత్తతలను నిర్మూలించాలన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రివ్యూ తీసుకోవడం జరుగుతుందని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హైమావతి, అంగన్వాడి సూపర్వైజర్స్, టీచర్లు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



చండూరు రెవెన్యు సదస్సులో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని గ్రామాలలో ఎలాంటి భూ సమస్యలు ఉండకుండా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం చండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా పలువురు రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. వారి సమస్యలను ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పట్టా పాసుపుస్తకాలలో తప్పులు ఉన్న, రిజిస్ట్రేషన్లలో పేర్లు తప్పుగా వచ్చినా, సాదాబైనామా ద్వారా భూమి కొనుగోలు తదితర భూ సమస్యలకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదులపై అధికారులు గ్రామస్థుల సమక్షంలోనే విచారించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్, డీటీ సిందుజా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చలాన్ల టార్గెట్

● దాడులకు దారితీస్తున్న తనిఖీలు

● రక్షక భటులకే రక్షణ కరువు

● వాహనదారులకు భారంగా జరిమానాలు

రామాయంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు చలాన్ల టార్గెట్లు నరకం చూపుతున్నాయి. తమ విధుల్లో సింహాల్లా విరుచుకుపడాల్సిన ఖాకీలకే రక్షణ కొరవడింది. నిత్య తనిఖీలతో జనాల్లో చులకనవుతున్నారు. మెదక్ జిల్లాలోని 21 పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ ఆదాయమే లక్ష్యంగా వాహనదారులపై విచ్చలవిడిగా జరిమానాలు వేస్తున్నారు. దీంతో ఇటీవల పలురు బైకర్లు పోలీసులనే ఢీ కొట్టి గాయపరచడం.. వారిపై తాగినమత్తులో దాడులకు తెగబడటం సర్వ సాధారణమైంది. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అవ్వడంతో పోలీసు శాఖ నిర్వీర్యం అవుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో రోజువారీగా సుమారుగా 20 దాకా అంటే.. జిల్లా వారీగా నిత్యం 300 నుంచి 400 వాహనాలకు వివిధ కారణాలతో ఆన్‌లైన్ జరిమానాలు విధిస్తున్నారు. దీంతో నిత్యం లక్ష రూపాయల దాకా ఆదాయం వచ్చి పడుతోంది. తాగి నడపడం, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసిన వారే దీనిలో అత్యధిక బాధితులని చెప్పవచ్చు. ఓ ప్రక్క జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, అన్ని మండల కేంద్రాల్లోనూ ఇరుకు రోడ్లే ఉండటంతో ప్రజలు షాపింగ్ చేయడం వారికి శాపంలా మారింది. ఇక్కడ వాహనాలు నిలిపితే గుట్టుచప్పుడు కాకుండా తమ ట్యాబ్‌లలో ఫోటోలు తీసి నేరుగా మెసేజ్ రూపంలో సదరు వాహనదారుడికి జరిమానా పంపుతున్నారు. ఇక జాతీయ రహదారులపై వేగం పెరిగితే రూ.900 దాకా ఫైన్లు వేస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. అదేగాక వైన్స్‌లకు అతి చేరువలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం ద్వారా మద్యం ప్రియులు సులువుగా పోలీసులకు చిక్కి కోర్టుల దాకా వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి ఘటనలతో విసిగి, బేజారిన బాధితులు పోలీసు తనిఖీల్లో గొడవలకు దిగుతున్నారు.

ఇలాంటి ఘటనే వారం క్రితం జిల్లాలోని శివ్వంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై మద్యం తాగి వెళ్తుండగా తనిఖీలు చేసేందుకు ఆపడంతో ఏఎస్‌ఐ శ్రీనివాస్ పై దాడికి తెగబడ్డారు. అలాగే రామాయంపేట పట్టణ శివారులో మోపెడ్ వాహనాన్ని నిలపమన్నందువు ఏకంగా పోలీసునే ఢీ కొట్టి గాయపరిచిన సంఘటన ఎనిమిది మాసాల కిందట చోటు చేసుకుంది. ఇలాంటివి పలుచోట్ల పునరావృతమవుతూనే ఉన్నాయి. తప్పు చేసిన వారు పోలీసులు అంటేనే భయంతో వణికి పోవాల్సి ఉన్నా ఫ్రెండ్లీ పోలీస్ విధానం లాంటివి ఖాకీలకు అడ్డొస్తున్నాయి. ఇకనైనా పోలీసు శాఖలో మార్పులు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రజా భద్రత గాలిలో దీపం..

పోలీసులు ఎంతసేపు జరిమానాలను విధించడంలోనే నిమగ్నమవుతున్నారే తప్ప వాహనదారుల ఇబ్బందులను ఎంత మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రహదారులపై నిత్యకృత్యంగా మారిన ట్రాఫిక్ సమస్య తీర్చడంలో వారి సమయమే లేకుండా పోతుందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. రోడ్డెక్కితే వాహనాలకు చలాన్లు వేసే విధులు తప్ప.. రోడ్లపై జనం ఎదుర్కొంటున్న ఇబ్బందులు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పోలీసు భద్రత గాల్లో దీపమేనంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. తప్పు చేసిన వారిని దండించాల్సిన పోలీసులు రోజంతా చలాన్లపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

స్వయం ప్రతిపత్తి.. ఐఎస్‌వో గుర్తింపు

● సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఘనత

● దోస్త్ ద్వారా అడ్మిషన్లు.. వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : న్యాక్ ఏ+గ్రేడు కలిగి ఉండి, ఐఎస్‌వో గుర్తింపు పొంది స్వయం ప్రతిపత్తి కలిగిన ఏకైక కళాశాల సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత అన్నారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ల నేపథ్యంలో ఈ కళాశాల ప్రాముఖ్యతను, వివిధ కోర్సులను, వనరులను తెలియజేసేవిధంగా రూపొందించిన వాల్ పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1956లో ప్రారంభమై ఎంతోమంది విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. అన్ని వసతులతో కూడిన ల్యాబ్స్, పీహెచ్‌డీ, నెట్, సెట్ పూర్తిచేసిన అనుభవముగల అధ్యాపకులచే విద్యా బోధన ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మొదటి ప్రాధాన్యతగా ఈ కళాశాలను ఎంచుకోవాలని కోరారు. అడ్మిషన్ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కళాశాలలోని దోస్తు జిల్లా సహాయ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, డా గోపాల సుదర్శనం, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, వి. గురుమూర్తి దోస్తు టెక్నికల్ అసిస్టెంట్ మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం



కొలువైన స్వామివారు

వర్గల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 10 నుంచి 20 ఉత్సవాలు జరగనుండగా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల సందర్భంగా ప్రతీ రోజు ఆలయంలో భగవద్గీత పారాయణం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ఆరాధన, గోష్ఠి, ప్రధాన యాగ శాల యందు దశ హవనములు, మూల మంత్ర హోమములు, ఉత్సవ మూర్తులకు తిరుమంజనం, మశిహరణ, నివేదన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద గోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వేదాంతం మురళీధర చార్యులు తెలిపారు. ఆలయ నిర్వాహకులు ప్రొద్దటూరి రాజులుగుప్త, టేకులపల్లి రాంరెడ్డి నేతృత్వంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పుల్‌కల్, మే 9 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన చౌటకూర్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు స్థానిక గౌడ సంఘం అధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగున్నాయి. 12వ తేదీన గంగకు పోవుట, తెప్పోత్సవం, పూజ కార్యక్రమాలు, 13న రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని మహర్షి కల్యాణోత్సవం, బోనాల ఊరేగింపు అనంతరం అన్నదాన వితరణ నిర్వహించనున్నారు.

రేపటి నుంచి మల్లికార్జున స్వామి జాతర

అల్లాదుర్గం. మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిపెద్దాపూర్ శ్రీమల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 11న స్వామి వారికి, ఎల్లమ్మ దేవతకు బోనాలు, 12న ఆలయం వద్ద ఎడ్ల బండ్ల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కవిత్వానికి సమాజమే పునాది

● 'మరసం' ఆధ్వర్యంలో కవి అలాజీపూర్ కిషన్ పుస్తకాల ఆవిష్కరణ ● హాజరైన డాక్టర్ నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్



అలాజీపూర్ కిషన్ రాసిన పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అతిథులు

సిద్దిపేట కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : కవిత్వానికి సమాజమే పునాది అని రచయిత, సామాజిక విశ్లేషకులు ఎన్.వేణుగోపాల్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి అలాజీపూర్ కిషన్ రాసిన పుస్తకాలు, పేగు తెగిన పాట, వడిసెల ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాలను ఆవిష్కరించారు. మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె. రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక నేపథ్యమే పునాదిగా రచనలు చేస్తే ఆ రచన సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందని అన్నారు. వ్యక్తిగతమైన సాహిత్యం ఎక్కువ కాలం నిలబడేది కాదని అన్నారు. వ్యక్తిగతమైన అంశాల ప్రాతిపదికన రాసిన కవిత్వానికి కూడా సమాజమే ప్రధాన వస్తువుగా ఉంటుందని అన్నారు. ప్రఖ్యాత కవి రచయిత తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ కిషన్ తన రెండు కవితా సంపుటిల ద్వారా ఎంత గొప్ప కవిత్వాన్ని రాశాడో అంతే గొప్పగా ఒక సాహిత్య కార్యకర్తగా కూడా పనిచేశాడని అన్నారు. మంజీరా రచయితల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ప్రారంభమై తెలుగు నేలపై గొప్ప సాహిత్య సంస్థగా ఎదగడంలో కిషన్ నిర్వహించిన పాత్ర గొప్పదన్నారు. శాసనమండలి సభ్యులు, ప్రముఖ కవి గాయకుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను సాహిత్యం వైపు నడిపించిన వాళ్లలో ప్రథముడు కిషన్ అని అన్నారు. సాహిత్యంలో తనకు ఓనమాలు దిద్దించాడని చెప్పారు. టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్ మాట్లాడుతూ మంజీరా రచయితల సంఘం గత 40 ఏళ్లుగా సాహిత్య రంగానికి చేసిన కృషి అనిర్వచనీయమైనదని అన్నారు. సమాజంలో జరిగిన అనేక పరిణామాలలో మంజీరా రచయితల సంఘం ఉందని, మంజీరా కవులు ఒక సామాజిక బాధ్యతగా తమ కవిత్వాన్ని వెలువరిస్తూ ప్రజల పక్షాన నిలబడ్డారని అన్నారు.

కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారం

సిద్దిపేటకు చెందిన ప్రముఖ వచన కవి అలాజీపూర్ కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని అందజేశారు. గత 35 ఏండ్లుగా సామాజిక దృక్పథంతో కవిత్వం రాస్తున్న అలాజ్ పూర్ కిషన్ వడిసెలు, పేగుతెగిన పాట కవితా సంపుటాలను వెలువరించారు. ప్రజల పక్షాన నిలబడి సాహిత్య సృజన చేస్తున్న అలాజ్ పూర్ కిషన్‌కు వేముగంటి నరసింహాచార్యుల పేరిట ఏర్పాటుచేసిన సాహిత్య పురస్కారానికి వేముగంటి సాహిత్య పీఠం ఎంపిక చేసింది. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సాహిత్య సభలో అలాజ్ పూర్ కిషన్‌కు వేముగంటి సాహితీ పురస్కారాన్ని పలువురు ప్రముఖ రచయితలు అందజేశారు.

డీఎస్‌జేవో దశరథంకు పదోన్నతి

● నిజామాబాద్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ

సంగారెడ్డి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జైళ్ల శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాలో డిస్ట్రిక్ట్ సబ్ జైల్స్ ఆఫీసర్(మెదక్-డీఎస్‌జేవో)గా విధులు నిర్వహిస్తున్న సి.హెచ్.దశరథంకు పదోన్నతి లభించింది. నిజామాబాద్ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఆయనను పదోన్నతిపై బదిలీ చేస్తూ జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్యమిశ్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన్నే సిద్దిపేట జిల్లా జైలుకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దశరథం పదోన్నతిపై నిజామాబాద్‌కు బదిలీ వెళ్లనున్న నేపథ్యంలో మెదక్ డీఎస్‌జేవోతో పాటు సిద్దిపేట జిల్లా జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలను సంగారెడ్డి(కంది)సెంట్రల్ జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ డి.భరత్‌కు అదనంగా అప్పగించారు.

న్యూస్ బాక్స్

జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

మెదక్ అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ శుభవల్లి సూచించారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్జి మాట్లాడుతూ... జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 19 వరకు ప్రత్యేక జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. జూన్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేనేజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్/ నారాయణఖేడ్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా పారిశ్రామిక రంగ అభివృద్ధి కోసం కాంట్రాక్ట్ పద్ధతిన పని చేయడానికి మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లతో పాటు ఈడీసీ మేనేజర్ పోస్టులకు అర్హులైన వారు ఈనెల 10 లోగా ఆన్‌లైన్‌ల దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ తుల్జానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌ఐఎంఎస్‌ఎంఈ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8297384192 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అనుమతులు లేని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా ప్రారంభమైన ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో శుక్రవారం డీఈవో వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసగిస్తున్నారన్నారని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, రవితేజ తదితరులు ఉన్నారు.

నేల తల్లిని కాపాడుకోవాలి

మనోహరాబాద్ మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేతలు విద్యార్థులతో కలసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. మనోహరాబాద్ మండల కేంద్రం, జీడిపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రొఫెసర్ విజయలక్ష్మి ఉపాధి కూలీలు, రైతులతో మాట్లాడుతూ రైతులు పొలంలో యూరియా వాడకం సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, అవ సరం మేరకే రసాయనాలను వినియోగించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రైతులు సాగు నీటిని ఆదాచేసుకొని, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడు కోవాలని అవగాహన కల్పించారు. ఇందులో సీనియర్ శాస్త్రవేత శ్రీనివాస్, వినయ్, విజయలక్ష్మి, ఏవో స్రవంతి, ఏఈవో సచిన్, నరేందర్‌గౌడ్, అశోక్ కుమార్, వెంకటేష్, కృపారాణి, రైతులు పాల్గొన్నారు

ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలను నమోదు చేసుకోవాలి

శివ్వంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భూమి ఉన్న ప్రతీ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని ఏవో లావణ్య తెలిపారు. ఈ ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబంధించిన వివరాలను, సంబంధిత పత్రాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలన్నారు. వాటితో పాటే మొబైల్ ఫోన్ నెంబరు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ మొబైల్ నెంబర్ కు మూడు ఓటీపీలు వస్తాయని, ఈ వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారికి అందించినట్లయితే 11 అంకెలతో కూడిన రైతు విశిష్ట సంఖ్య అందజేయబడుతుందన్నారు.

'పాలిసెట్'ను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మే 9(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించే పాలిసెట్ ప్రవేశపరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవా లని కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతు ఈనెల 13న రాష్ట్ర వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు ప్రవేశపరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా జహీరాబాద్ పట్టణంలో ఆర్‌ఎల్లార్‌పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీకాకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు .పాలిసెట్ ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9.30గంటల లోపు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

మెదక్, మే 9 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి 3 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మెదక్‌లో పర్యటించిన బక్కి వెంకటయ్యను కలిసి ఆయన మాట్లాడారు. వెంట ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, జిల్లా కార్యదర్శి హన్మకొండ దయాసాగర్ తదితరులున్నారు.

గోతులు తీశారు.. పనులు మరిచారు

- మస్లాపూర్ ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి 6 నెలల క్రితం రూ.20లక్షలు మంజూరు
- పునాదులు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- అంగన్‌వాడీ సమీపంలో ప్రమాదకరంగా మారిన గోతులు


ముస్లాపూర్ గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం పక్కా భవన నిర్మాణం కోసం తీసిన గోతులు

అల్లాదుర్గం,మే 9. (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యంతో పాటు వసతులు కూడా కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూమి పూజలు, శంకుస్థాపనల సమయంలో కనిపించే హడావిడి ఆ తర్వాత పనులు జరిగే సమయంలో మచ్చుకైనా కనిపించడంలేదు. అధికారుల అలసత్వమో.. గుత్తేదార్ల నిర్లక్ష్యమోగాని పనులు ముందుకు సాగడం లేదని అల్లాదుర్గం మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని మస్లాపూర్ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం పనులను ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిదర్శనంగా చెబుతున్నారు.

పునాది గుంతలకే పరిమితం

మండలంలోని మస్లాపూర్ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం అరకొర వసతులతో అద్దె భవనంలో కొనసాగుతుంది. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవతో పక్కాభవన నిర్మాణం కోసం ఆరు నెలల క్రితం 15వ ఆర్థిక ప్రణాళిక నిధుల ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండున్నర నెలల క్రితం ఈ భవన నిర్మాణం కోసం ఎంతో ఆర్భాటంతో అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భూమి పూజ చేయడంతో సదరు గుత్తేదారు పనులను సైతం ప్రారంభించారు. అయితే భవన నిర్మాణం కోసం గోతులు తీసి పనులు ఆపేయడంతో ప్రమాదకరంగా మారాయి.

ప్రమాదం జరిగితే ఎవరి బాధ్యత?

ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ స్థలం వద్ద నివాస గృహాలతో పాటు ఓ అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి ఆ గోతిలో పడితే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో స్థానికులు అటు వైపు వెళ్లినప్పుడు జరగరానిదేదైనా జరిగితే బాధ్యత ఎవరిదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా బడిబాట


వట్‌పల్లి: నాగులపల్లిలో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, అధికారులు

వట్‌పల్లి/పుల్‌కల్/నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, మే 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి ఐదేళ్లు నిండిన పిల్లలను సర్కారుబడిలో వేయాలంటూ అవగాహన కల్పించారు. ఉపాధి హామీ పని ప్రదేశాలకు వెళ్లి కూలీల పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని నచ్చజెప్పారు. వట్‌పల్లి మండలం నాగులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర్ ఉపాధ్యాయులతో కలసి ఉపాధి పనులు జరిగే ప్రదేశాలను సందర్శించారు. బడి ఈడు పిల్లలను పనులకు పంపించవద్దని, పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సత్యకుమార్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ షాదుల్ తదితరులు ఉన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ప్రీతంనాయక్, శైలజ, ఉపాధ్యాయులు సీ.మోహన్‌రెడ్డి, భాస్కర్, రవీందర్, మల్లేశం, ఎలీషా, విజయ, కవిత తదితరులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషోర్, ఉపాధ్యాయులు వెంకట్‌రావు, గురునాథ్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగల్‌గిద్ద మండలంలోని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు, జడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హీరామన్, ఉపాధ్యాయులు ఉన్నారు

తూప్రాన్ డివిజన్‌లో 2.5లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు


తూప్రాన్‌లో ఓ రైస్ మిల్లును పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్ మే 9 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ డివిజన్ పరిధి ఆరు మండలాల్లో 80 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 2.50 లక్షల క్వింటాళ్ల వడ్లు కొనుగోలు చేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. 81 కొనుగోలు కేంద్రాలు కేటాయించగా, 80 కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగినట్లు చెప్పారు. తూప్రాన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మనోహరాబాద్ మండలం పోతారం కేంద్రంలో వరి కోతలు ఇంకా మొదలు కానందున కొనుగోళ్లను ప్రారంభించలేదన్నారు.

తూకాన్ని వేగవంతం చేయాలి

హవేళిఘణపూర్/చిన్నశంకరంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడాన్ని వేగవంతం చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని తొగిట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం హవేళిఘణపూర్‌లోని గాయత్రి పారాబాయిల్డ్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. వెంట తహసీల్దార్ సింధు రేణుక, తదితరులున్నారు. అదేవిధంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు జంగరాయి, సూరారం, చందాపూర్ కత్తెర గ్రామాలను తహసీల్దార్ మన్నన్ సందర్శించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం తూకాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నారాయణఖేడ్, మే 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో మార్క్‌ఫెడ్ సహకారంతో మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఐకేపీ ఏపీఎం వంశీక్రిష్ణ, ఎఫ్‌పీవో సీఈవో రామారావు శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నలకు క్వింటాల్‌కు రూ.3,371 మద్దతు ధరగా చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నర్సింలు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు మాణిక్‌గౌడ్, ఏఈవో సతీష్‌కుమార్, వీవోఏ శ్రీనివాస్, నాయకులు సాయిలు, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం' గృహాలను వినియోగంలోకి తెస్తాం


ఖేడ్ శివార్లలోని డబుల్‌బెడ్రూం గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ శివార్లలో నిర్మించిన డబుల్‌బెడ్రూం గృహాలను త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం డబుల్‌బెడ్రూం గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంపూర్తి దశలో ఉన్న డబుల్ బెడ్రూంగృహాలను పూర్తి చేయించడానికి తోడు అవసరమైన వాటికి మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరయ్యాయని, అన్ని పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కొన్ని బ్లాక్‌లలో మిగిలిపోయిన శానిటరీ, విద్యుత్ వైరింగ్, తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులు పూర్తి చేయించాలని, ప్రభుత్వం ద్వారా రావాల్సిన బకాయిలను కూడా విడుదల చేయిస్తామని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ అధికారులు, నాయకులు ఉన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతికల్పించి, వేతనాన్ని రూ.7,800 నుంచి రూ.13,600లకు పెంచడంతో నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, తరగతులను నిర్వహించనున్నందున, పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుజాత, మున్సిపల్ తాజామాజీ వైస్ చైర్మన్ దారంశంకర్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, నాయకులు తాహెర్, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు ముంతాజ్,సుబురు, న్యాయవాది సంగన్న, తదితరులు ఉన్నారు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, మే 9(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకాపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరీ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. రంగంపేట పీఠాధిపతి మాధవానందస్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా పెద్దమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే రోహిత్ తదితరులు

రామాయంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి రాయిలాపూర్ పెద్దమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒడి బియ్యం పోశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వహణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సేవాలాల్ ఆలయ వార్షికోత్సవాలు

పాపన్నపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్రియాతండాలో సేవాలాల్ ఆలయ వీవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. తండా వాసులు బోనాలు ఊరేగించారు.ఉత్సవాల్లో ముంగి దేవగిరి మహరాజ్ పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

108 అంబులెన్సులో ప్రసవం


శిశువును కుటుంబీకులకు ఇస్తున్న ఈఎంటీ శ్రీనివాస్

తూప్రాన్ మే 9 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ సీహెచ్‌సీలో ప్రసూతి కష్టమని గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేయగా మార్గమధ్యలో అంబులెన్స్‌లో ప్రసవం అయిన ఘటన తూప్రాన్ మున్సిపాల్టీ పరిధిలో చోటు చేసుకున్నది. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని పోతారాజ్‌పల్లికి చెందిన కృప క్రాంతికుమార్ దంపతులకు రెండో ప్రసవం కోసం తూప్రాన్ ప్రభుత్వ సీహెచ్‌సీ ఆసుపత్రికి వచ్చారు. సిబ్బంది పరీక్షించి ఇక్కడ డాక్టర్లు, అవసరమైన పరికరాలు లేనందువల్ల కాన్పు కష్టమవుతుందని, గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని రిఫర్ చేశారు. దీంతో వారు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో కృప పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పండంటి మగ బిడ్డకి సాధారణ ప్రసవం 108 ఈఎంటి శ్రీనివాస్ అంబులెన్స్‌లోనే సాధారణ ప్రసవం చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

పాతుకుపోయారు!

(5వ పేజీ తరువాయి)

పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని పరిస్థితుల కారణంగా సదరు అధికారి కూడా వారికి లొంగిపోతున్నారు. కొందరు రైటర్లు కేసుల విషయంలో అధికారులకు తప్పుడు సమాచారమిచ్చి తప్పుతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల సమాచారాన్ని అవతలి పక్షం వారికి చేరవేస్తున్నారనే విమర్శలున్నాయి.

మారుమూల ప్రాంతాలపైనే మక్కువ

సంగారెడ్డి జిల్లాలో మారుమూల నియోజకవర్గంలో పోస్టింగ్ అంటే ఏ శాఖలోనైనా పనిష్మెంట్‌గా భావిస్తారు. కానీ, పోలీసుశాఖలో కొందరు రైటర్లు ఈ నియోజకవర్గంలో దశాబ్దాలుగా పాతుకుపోయారు. ఒకే సర్కిల్‌లో బదిలీలు చేయించుకుంటూ స్టేషన్, సర్కిల్, డీఎస్పీ కార్యాలయం అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కొత్త ఎస్పీ రావడంతో ఇలాంటి వారి పీడ వదిలిపోతుందేమోనని ఆ ప్రాంతం వాసులు ఆశిస్తున్నారు.

సికింద్లాపూర్ రైతులతో ఆర్డీవో సమావేశం

నర్సాపూర్, మే 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి రీచ్ కెనాల్ కోసం భూములు ఇస్తున్న శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ రైతులతో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ సమావేశమయ్యారు. అవార్డు విచారణలో భాగంగా శుక్రవారం స్థానిక రైతు వేదికలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతుల అభ్యంతరాలను తెలుసుకుని, వారి సందేహాలను నివృతి చేశారు. త్వరలోనే పరిహారం సంబంధిత రైతులకు అందుతుందని ఆర్డీవో తెలిపారు. కెనాల్ కోసం ఇస్తున్న భూములకు సంబంధించి ఏ ఇతర సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో శివ్వంపేట తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు తవ్వేశారని రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులకు నచ్చజెబుతున్న తహసీల్దార్

శివ్వంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లకుండా రోడ్డును తవ్వేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేసిన సంఘటన శుక్రవారం చిన్న గొట్టిముక్కలలో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్న గొట్టిముక్ల గ్రామంలో సర్వే నంబర్ 29లో గడీల సుదర్శన్ రావుకు 5 ఎకరాల 22 గుంటల భూమి, ఏనుగు అఖిల్ రెడ్డి పేరిట 3 ఎకరాల 24 గుంటల భూమి మొత్తం 9 ఎకరాల 6 గుంటల భూమి ఉంది. ఆ పట్టాదారులు ఏడీ సర్వే నిర్వహించి చుట్టూ కంచెను ఏర్పాటు చేసేందుకు తమ పట్టా భూమిలో ఉన్న ఉపాధి హామీలో పోసిన రోడ్డును శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో తవ్వేశారు. ఆ రోడ్డును తవ్వేయడంతో తమ పొలాలకు దారి లేకుండా పోయిందని సుమారు 20 మంది రైతులు నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా ఉన్న రోడ్డును తొలగించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, పట్టాదారుల మధ్య స్వల్ప వివాదం తలెత్తడంతో వెల్దుర్తి ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కమలాద్రి గుంతను పూడ్చి వేయించి పనులు నిలిపివేయాలని రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని రైతులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

'సన్‌రైజ్' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


సన్‌రైజ్ హాస్పిటల్‌లో రక్తదానం చేస్తున్న యాజమాన్యం, డాక్టర్లు

సంగారెడ్డి అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని సన్‌రైజ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సన్‌రైజ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.స్వామిగౌడ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 120 మందికిపైగా పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా డా.స్వామిగౌడ్ మాట్లాడుతూ సన్‌రైజ్ హాస్పిటల్‌లో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద తాజాగా న్యూరో, యూరాలజీ, నెఫ్రాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాజమాన్యం పి.సంతోష్ గౌడ్, డా.మల్లిక, చింతాసాయి, రాములుగౌడ్, డాక్టర్లు మహేశ్, కళ్యాణ్‌చక్రవర్తి, వెంకటేశ్, ప్రసన్నరాణి, కృష్ణ, అరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం


సంగారెడ్డిలోని కేకే భవన్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నేత చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మోదీ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఏకమై ఎండగడదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో వివిధ యూనియన్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల పొట్ట కొట్టి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూరుస్తుందని విమర్శించారు. కార్మికుల నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ. సాయిలు, నాయకులు బాగారెడ్డి, ప్రవీణ్, మంగ, కొండల్‌రెడ్డి, రాందాస్, సురేష్, దయానంద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

వెల్దుర్తి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి గౌరీ పిలుపునిచ్చారు. శుక్రవారం వెల్దుర్తిలో సీఐటీయూ నాయకులతో కలిసి గౌరీ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, శ్రీను, సాయిలు, సత్యం, యాదగిరి, బాబు కిష్టా, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'రేషన్ బియ్యాన్ని సకాలంలో అందించాలి'

చిన్నశంకరంపేట మే 9 (ఆంధ్రజ్యోతి) రేషన్ బియ్యాన్ని వినియోగదారులకు సకాలంలో అందించాలని తహసీల్దార్ మన్నన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్ కొండాపూర్, చందాపూర్, తదితర గ్రామాలను సందర్శించి రేషన్ షాపులను ఆకస్మిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులలో నిర్వహించే స్టాక్ రిజిస్టర్, స్టాక్ తెలిపే బోర్డు, బయోమెట్రిక్ ఈ పాస్ యంత్రాలను ఆయన పరిశీలించారు.

'అక్రమంగా పట్టాలపై చర్యలు తీసుకోవాలి'

శివ్వంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల బయన్న చెరువు శిఖంభూమిలో వాయిలు కుంట, కుమ్మరికుంటలో అక్రమంగా పట్టా చేసుకున్నవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని శుక్రవారం గ్రామ రైతులు తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఓ మాజీ ఎమ్మెల్యే 2013లో తమ కుటుంబీకులు చనిపోయిన వారి పేరిట ఉన్న 46 ఎకరాల భూమిని పట్టాదారుల ప్రమేయం లేకుండా అక్రమంగా బినామీ పేర్ల మీద పట్టా చేసుకొని బోర్లు వేసి పంట వేసుకుంటూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అక్రమంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు.

'నీటి సమస్యను పరిష్కరించండి'

వెల్దుర్తి, మే9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బండపోసానిపల్లి గ్రామంలోని 5వ వార్డులో తాగు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలోని సిబ్బందికి బండపోసానిపల్లి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 5వ వార్డులో ఆరు వారాల నుంచి తాగు నీరు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించిన సమస్య పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో గౌరీ, కుమార్, నరేందర్ తదితరులు ఉన్నారు.